ఒక వైపే తొలగిస్తున్నారు!

- ఎస్సారెస్పీ ఆనకట్టపై ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు
- ఒక వైపు తొలగించి.. మరోవైపు వదిలేస్తున్న అధికారులు


ఆనకట్టపై లోపలి వైపు పెరిగిన పిచ్చి మొక్కలు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఆనకట్టపై ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను ఓ వైపు మాత్రమే తొలిగిస్తున్నారు. మరో వైపు అలాగే వదిలేస్తున్నారు. ప్రాజెక్ట్ ఆనకట్టపై గత కొంత కాలంగా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో ప్రాజెక్ట్ నిర్వహణ సంస్థ ఆనకట్టపై పిచ్చి మొక్కలను తొలిగింపజేస్తోంది. ఆనకట్టపై నిర్మించిన సేఫ్టీవాల్ అవతలి వైపు మాత్రమే పిచ్చి మొక్కలను తొలిగించి చేతులు దులుపుకున్నారు. ప్రాజెక్ట్ లోపలి వైపు మాత్రం వదిలేశారు. అసలు సమస్య ప్రాజెక్ట్ లోపలి వైపు పిచ్చి మొక్కలు ఉండటమే. పిచ్చి మొక్కలు కాస్తా చెట్లుగా ఎదుగుతున్నాయి. ఆనకట్ట రివిట్ మెంట్‌లోకి వేర్లు చొచ్చుకుని పోతాయి. దీంతో ఆనకట్ట వదలుగా మారే ప్రమాదం ఉంది. గతంలోనే డ్యాం సేఫ్టీ అధికారులు ప్రాజెక్ట్‌ను సందర్శించిన సమయంలో పిచ్చి మొక్కలను తొలిగించాలని హెచ్చరించారు. కానీ ప్రాజెక్ట్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రాజెక్ట్ వద్ద కుడి, ఎడమలు కలిసి సుమారు 14 కిలోమీటర్ల మేర పొడవున ఉంది. ఆనకట్ట పొడవు పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి ఉన్నాయి. ప్రాజెక్ట్ వైపు మాత్రం ముళ్ల పొదలు ఎక్కువగా ఉన్నాయి. ప్రాజెక్ట్ అధికారులు స్పందించి ఆనకట్టపై పూర్తిగా పిచ్చి మొక్కలను తొలిగించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ప్రాజెక్ట్ సందర్శనకు వస్తున్న పర్యాటకులకు కూడ ఈ ముళ్ల పొదలతో తిప్పలు తప్పడం లేదు.

క్లుప్తంగా

ఎరువులు అందుబాటులో ఉంచాలి



రుద్రూర్: యాసంగి సీజన్‌కు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని కోటగిరి మండల వ్యవసాయ అధికారి రాజు సూచించారు. కోటగిరిలోని రైతు వేదికలో సింగిల్ విండో కార్యదర్శులు, ఫర్టిలైజర్ డీలర్లతో ఏర్పాటు చేసిన ఆయన.. డీఏపీ, యూరియా కొరత లేకుండా చూడాలని, నిర్ణీత ధరకే విక్రయించాలని, గుర్తింపు పొందిన కంపెనీల నుంచి ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయాలని సూచించారు. రైతులకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. సమావేశంలో వ్యవసాయ విస్తీర్ణాధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

మోడల్ పాఠశాల తనిఖీ



బాల్కొండ: ఆరు, తొమ్మిదో తరగతి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని ఎంఈవో రాజేశ్వర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మోడల్‌పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

విద్యార్థులకు చెకుముకి పోటీలు

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఆలూర్, కల్లెడి, గుత్ప, దేగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి పోటీలు నిర్వహించారు. పోటీల్లో కల్లెడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన సంజన, అఖిల, గోపిచంద్ అత్యధిక మార్కులు సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఆలూర్ ఎంఈవో మేస నరేందర్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అష్ఫక్ అహ్మద్, శ్రీకాంత్, పిట్ల గణేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలి



మాక్లూర్: రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యాన్ని ఉచితంగా అందించడంతోపాటు పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకుడు రమేశ్, మండల అధ్యక్షుడు పి కిషన్ గురువారం తహసీల్దార్ శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్మసమాజ్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ ఆదేశాల మేరకు వినతిపత్రం అందజేశామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీహరి, నర్సయ్య, భూమేశ్ పాల్గొన్నారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలి

ఆర్మూర్: దివ్యాంగులైన విద్యార్థులకు సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో అందించే ఉచిత ఫిజియోథెరపీ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్మూర్ మండల విద్యాధికారి రాజగంగారాం సూచించారు. పట్టణంలోని భవిత కేంద్రంలో ఉచిత ఫిజియోథెరపీ వైద్య శిబిరాన్ని గురువారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. వైద్యురాలు అరుణ సెరిబ్రల్ పాల్సీతో బాధపడుతున్న చిన్నారులకు చికిత్స నిర్వహించారు. శిబిరంలో రిసోర్స్ పర్సన్ కిషన్, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ అలేఖ్య, ఆపరేటర్ రఘు, మెసెంజర్ రవి, సీజీవీ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

జీవన భృతి అందజేయాలి

నందిపేట్ (ఆర్మూర్): వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వం సంవత్సరానికి రూ.12వేల జీవనభృతి అందజేయాలని ఏఐపీకేఎంఎస్ జిల్లా నాయకుడు కే గంగాధర్ డిమాండ్‌చేశారు. నందిపేట మండలంలోని వెల్మల్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. సమావేశంలో నాయకులు రాజలింగం, అనంతరావు, మల్లన్న, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవీపేట: అనారోగ్యంతో బాధపడుతూ గత శనివారం మృతి చెందిన నాగేపూర్ మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలు మామిడి లక్ష్మి కుటుంబ సభ్యులను ఆయా గ్రామాలకు చెందిన ఏజెన్సీల నిర్వాహకులు గురువారం పరామర్శించారు. మామిడి లక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రతి పౌరుడు నిబంధనలు పాటించాలి


సదస్సులో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్

బోధన్‌టౌన్(బోధన్): ప్రతి పౌరుడు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఏసీపీ శ్రీనివాస్ సూచించారు. గురువారం రాత్రి పట్టణంలోని బీసీ సంక్షేమ బాలికల వసతి గృహంలో పోలీస్, ట్రాన్స్‌పోర్ట్, బీసీ వెల్ఫేర్‌శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించగా, ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించొద్దని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని, హెల్మెట్ ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపొద్దని, రోడ్డు క్రాస్ చేసే సమయంలో జీబ్రా క్రాసింగ్‌ను గమనించాలని సూచించారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తమ కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకొని నడపాలని, ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు అనంతరం విద్యార్థులతో రోడ్డు భద్రతానియమాలు పాటించాలని ప్రతిజ్ఞ చేయించారు. సదస్సులో, ఎంవీఐలు శ్రీనివాస్, వివేకానందరెడ్డి, పట్టణ సీఐ వెంకటనారాయణ, అసిస్టెంట్ బీసీ వేల్ఫేర్ అధికారి నర్సయ్య, వార్డెన్ లలిత తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు కృషి చేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు సుమన్

బాల్కొండ: ఉద్యోగుల హక్కుల సాధన కోసం సంఘటితమై కృషి చేద్దామని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్‌కుమార్ అన్నారు. గురువారం ముప్కాల్ మండల కేంద్రంలో రైతు వేదిక వద్ద ఎస్సారెస్పీ యూనిట్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారినికి కృషి చేస్తానని, టీఎన్జీవోస్ జిల్లా కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి పోల శ్రీనివాస్, ఎస్సారెస్పీ యూనిట్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన



వర్ని: మోస్రా మండలం చే(6) నంబర్ తండాలో జగదాంబ మాత, సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈనెల 19న ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వేద పండితులు యజ్ఞం, హోమం నిర్వహించారు. గురువారం ఆలయ ప్రారంభోత్సవానికి తండావాసులతోపాటు చుట్టుపక్కల తండాల గిరిజనులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

కమలాపూర్‌లో ముగిసిన ఉత్సవాలు..

నవీపేట: మండల కేంద్రంలోని కమలాపూర్ రహదారి పక్కన నూతనంగా నిర్మించిన శివ పంచాయతన శివాలయంలో గురువారంతో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ముగిశాయి. కేదారీశ్వర పీఠాధిపతి మంగి రాములు మహరాజ్, మల్లారం పీఠాధిపతి పిట్ల కృష్ణ మహారాజ్ చేతుల మీదుగా దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



ఎడపల్లి(బోధన్): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) నాయకులు కోరారు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదిక సహాయ కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ.. వికలాంగులక రూ.6వేలు, వృద్ధులకు రూ.4వేలు పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ జిల్లా కార్యదర్శి రాకేశ్‌వర్మ, మండల కార్యదర్శి గోఫూర్ సాయిలు, నాయకులు సాయమ్మ, లక్కం సింగ్, లలిత, సుజాత, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

బోనస్ ఆనందం



మాక్లూర్ : కొనుగోలు కేంద్రాల్లో సన్న ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ జమ చేస్తోంది. బోనస్ బ్యాంకు ఖాతాల్లో జమవుతుందో, లేదోనని తాము సందిగ్ధంలో ఉన్న సమయంలో డబ్బులు జమయ్యాయని మాక్లూర్, ముల్లంగి(బి) గ్రామాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముల్లంగి (బి)కి చెందిన బూరోల్ల సాయిలుకు రూ.లక్షా 16వేలు, ప్రదీప్‌రావుకు రూ.93వేల బోనస్ జమ అయ్యింది. దీంతో రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. రైతుల ఖాతాల్లో బోనస్ జమవుతున్నట్లు మాక్లూర్ విండో చైర్మన్ బూరోల్ల అశోక్ తెలిపారు.

మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు



ఎడపల్లి(బోధన్): మండలంలోని జైతాపూర్‌లో మహాలక్ష్మి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. మూడు రోజులపాటు కొనసాగిన ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యుడు సూర్యనారాయణ మాట్లాడుతూ.. గత రెండు సంవత్సరాల క్రితం ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశామని, యువకులు ముందుకు వచ్చి నిర్మాణ పనులు పూర్తి చేయడం సంతోషంగా ఉందన్నారు.

ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్‌కు సన్మానం



బోధన్‌టౌన్(బోధన్): రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు పట్టణంలో గురువారం అమృతాదిత్య చిట్‌ఫండ్‌ను ప్రారంభించారు. చిట్‌ఫండ్ నిర్వాహకులను బాలరాజును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు రిజిస్ట్రార్డ్ చిట్ ఫండ్ కంపెనీల్లో చీటీలు వేస్తే ఎలాంటి నష్టం ఉండదన్నారు. చిట్ ఫండ్ చైర్మన్ కొయ్యాడ శ్రీనివాగౌడ్, డైరెక్టర్లు బుర్క శంకర్‌గౌడ్, ఎల్లప్ప, నరేశ్, సురేశ్, అశోక్, బ్రాంచ్ మేనేజర్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు పరిశీలన



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ఉన్న డంపింగ్ యార్డు(డీఆర్‌సీ, కంపోస్ట్)ను మున్సిపల్ కమిషనర్ రాజు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజూ తడి, పొడిచెత్తను సిబ్బంది వేరు చేయాలన్నారు. తడి చెత్తతో ఎరువులు తయారు చేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే పట్టణంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ఆయనవెంట మున్సిపల్ సానిటరీ ఎస్సై గజానంద్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ పూర్ణమౌళి, సిబ్బంది ఉన్నారు.

మొరం రోడ్డు పనులు ప్రారంభం



రెంజల్(బోధన్): ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా కూనేపల్లి గ్రామానికి మంజూరైన మొరం రోడ్డు పనులను గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, రైతులు గురువారం ప్రారంభించారు. నియోజకవర్గ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సహకారంతో గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాల్లోని రోడ్ల మరమ్మతులకు సుమారు రూ.5లక్షల నిధులు మంజూరైనట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

ఏవోను సన్మానించిన డీలర్లు



రుద్రూర్: కోటగిరి మండల వ్యవసాయాధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాజును ఫెర్టిలైజర్ డీలర్లు, సింగిల్ విండో సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. కోటగిరి రైతు వేదికలో ఏవోకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు సహకరించాలని ఈ సందర్భంగా ఏవో కోరారు. కార్యక్రమంలో డీలర్లు కప్ప సంతోష్, గంగాధర్, కొండా రెడ్డి, విండో సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన టీచర్లకు సన్మానం



కమ్మర్‌పల్లి: మండలంలోని నర్సాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. హెచ్ఎం రాధాకిషన్‌తోపాటు ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పురంధర్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఈసీలో ఉత్సాహంగా ఫ్రెషర్స్‌డే


మాట్లాడుతున్న చైర్మన్ నరేందర్‌రెడ్డి

మాక్లూర్: మండలంలోని దాస్‌నగర్ వద్ద ఉన్న విజయ్ రూరల్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఫ్రెషర్స్ డేను ఉత్సాహంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ కె నరేందర్‌రెడ్డి కార్యక్రమానికి అధ్యక్షత వహించి ప్రసంగించారు. ప్రముఖ గాయకుడు కోకిల నాగరాజు తన ఆటపాటలతో అలరించారు. ప్రిన్సిపాల్ స్వప్న, విక్రం, గణేశ్, సురేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పాడి గేదె మృతి

వర్ని: మండల కేంద్రానికి చెందిన కుమ్మరి బాపురావు అనే వ్యక్తికి చెందిన పాడి గేదె గురువారం మృతి చెందింది. గత రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న గేదెకు చికిత్స చేయాలని పశువైద్యాధికారులు, గోపాల మిత్రలకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని, వారి నిర్లక్ష్యం కారణంగానే గేదె మృతి చెందిందని బాధితుడు తెలిపాడు. వెటర్నరీ జిల్లా అధికారులు వారిపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

సర్వేకు కాంగ్రెస్ శ్రేణులు సహకరించాలి


అధికారులకు వివరాలు తెలుపుతున్న రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

వేల్పూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సమగ్ర కులగణన సర్వేకు గ్రామాలలో కాంగ్రెస్ కార్యకర్తలు సహకరించాలని రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్ అన్వేష్‌రెడ్డి సూచించారు. తన స్వగ్రామమైన పచ్చలనడ్కుడలో గురువారం ఆయన సమగ్ర కులగణన వివరాలు నమోదు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే నిర్వహిస్తున్న అధికారులకు ఎక్కడైనా ఇబ్బంది ఏర్పడితే కాంగ్రెస్ కార్యకర్తలు సహకరించాలని సూచించారు. హెచ్ఎం మల్లేశ్, నాయకులు టక్కరి గంగాధర్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో 98శాతం పూర్తి..

ఆర్మూర్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో 96శాతం పూర్తయ్యిందని కమిషనర్ రాజు తెలిపారు. మిగతా సర్వేను శుక్రవారం పూర్తి చేస్తామన్నారు. అలాగే సర్వే పూర్తయిన కుటుంబాలకు సంబంధించిన డాటా ఎంట్రీ ప్రారంభించామన్నారు. మున్సిపల్ కార్యాలయంతోపాటు, నరేంద్ర డిగ్రీకళాశాలలో డాటా ఎంట్రీ సెంటర్లు ఏర్పాటు చేశామని ఎన్యుమరేటర్లు డాటా ఎంట్రీ ఆపరేటర్ల సహాయంతో సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు.


మాట్లాడుతున్న కోటగిరి తహసీల్దార్ గంగాధర్

తప్పులు లేకుండా నమోదు చేయాలి

రుద్రూర్: సమగ్ర కుటుంబ సర్వేలో ఎన్యుమరేటర్లు సేకరించిన వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని కోటగిరి తహసీల్దార్ గంగాధర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం డాటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రెడ్డి, మండల పంచాయతీ అధికారి చందర్, కోటగిరి, పొతంగల్ ఏఈవోలు ఎస్. శ్రీనివాస్‌రావు, లోల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత


చెక్కు అందజేస్తున్న వినయ్‌రెడ్డి

నందిపేట్ (ఆర్మూర్): అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని ఖుద్వాన్‌పూర్ గ్రామానికి చెందిన బైండ్ల గంగాధర్‌కు చికిత్స కోసం ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.60వేలు మంజూరు చేసింది. ఈ మేరకు గురువారం ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి బాధితు డి కుటుంబ భ్యుడు ప్రశాంత్‌కు చెక్కు అందజేశారు.

కిసాన్‌నగర్‌కు చెందిన వారికి..



బాల్కొండ: మండలంలోని కిసానగర్‌కు ఇద్దరికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు గంగాధర్, నగేశ్, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి మండలానికి చెందిన వారికి..



కమ్మర్‌పల్లి: మండలంలోని హాసాకొత్తూర్, చౌటపల్లి గ్రామాలకు చెందిన పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నర్సయ్య, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పడిగెల ప్రవీణ్, నాయకులు రేవతి గంగాధర్, కొమ్ముల రవీందర్‌రెడ్డి, కుందేటి శ్రీను, అల్లకొండ రాజేశ్, కుంట ఆనంద్, మేకల క్రాంతి, ఏనుగు మనోహర్, మోదిని శ్రీధర్, రిత్విక్ బాలయ్య, కొమ్ముల గణేశ్, మోహన్, రమేశ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

'లిల్లిపుట్'లో ఒలింపియాడ్


ఒలింపియాడ్ పరీక్ష రాస్తున్న లిల్లిపుట్ విద్యార్థులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లి లిల్లిపుట్ పాఠశాల విద్యార్థులకు గురువారం ఈ అభ్యాస్ అకాడమీ ఆధ్వర్యంలో ఒలింపియాడ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ.. ఒలింపియాడ్ పరీక్షల వల్ల విద్యార్థులకు ప్రతి సబ్జెక్టుపై పూర్తి అవగాహన వస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'జెంటిల్ కిడ్స్'లో ఫుడ్ ఫెస్టివల్


ఆహారపదార్థాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జెంటిల్ కిడ్స్ ప్లే స్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్ (ఆహార పదార్థాల వేడుక)ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ గుజరాతి ప్రకాశ్ మాట్లాడుతూ.. నిత్యజీవితంలో ఉపయోగపడే ఆహారం ప్రాముఖ్యతను, పోషకాల ఆవశ్యకతను పిల్లలకు వివరించారు. ప్రిన్సిపాల్ లత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 –	మందిర (తెలుగు)-10.30 దేవకి నందన వాసుదేవ (తెలుగు)-1.15 7.30 జిబ్రా(తెలుగు)-4.05 10.25
స్క్రీన్-3 –	మెకానిక్‌రాకీ(తెలుగు)-12.15 6.45 10.00 లక్కీ భాస్కర్(తెలుగు)-3.30
స్క్రీన్-4 –	అమరన్(తెలుగు)-11.35 6.20 మెకానిక్‌రాకీ(తెలుగు)-3.05 లక్కీభాస్కర్(తెలుగు)-9.50

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా షషియన్)

స్క్రీన్-1	అమరన్ -10.30 4.25 10.30 లక్కీ భాస్కర్(తెలుగు)-1.30 7.40
స్క్రీన్-3	కంగువ(2డీ-తెలుగు)-10.30 4.30 10.40 అమరన్ -1.30 7.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	కంగువ 3డీ తెలుగు-11.50 3.15 6.40 10.10
స్క్రీన్-2	గ్లాడియేటర్-2 (తెలుగు)-12.10 మట్కా(తెలుగు)-3.35 7.00 క(తెలుగు)-10.25
స్క్రీన్-3	అమరన్(తెలుగు)- 11.45 3.15 6.50 లక్కీ భాస్కర్(తెలుగు)-10.25
స్క్రీన్ -4	క(తెలుగు)-1.00 లక్కీ భాస్కర్(తెలుగు)-4.15 గ్లాడియేటర్(తెలుగు)- 7.30 అమరన్(తెలుగు)- 10.45
లలితామహల్	దేవర పార్ట్-1 (తెలుగు)
దేవి	మట్కా (తెలుగు)
నటరాజ్	అమరన్ (తెలుగు)
విజయ్	కంగువ 3డీ (తెలుగు)

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	77,300	వెండి(కిలో)	94,000
22 క్యారెట్స్	71,317	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800